# పుస్తకాల రాఘవయ్య

పెద్దబాలశిక్ష కొనటానికి పుస్తకాల రాఘవయ్యకోసం పుసులూరు వెళతాడు ప్రసాదరావు. రాఘవయ్య అక్కడుండటం లేదని పొన్నూరులో ఉంటున్నట్లు తెలుస్తుంది. పొన్నూరు రాఘవయ్యను కలుస్తాడు ప్రసాదరావు. వారిద్దరూ మాట్లాడుకుంటూండగా రాఘవయ్యను ఒకామె పిలుస్తుంది. ఆమె ఎందుకు పిలిచింది?

మా స్వగ్రామం పుసులూరు. వచ్చిన దగ్గరనుంచీ పుస్తకాల రాఘవయ్యకోసం నా అన్వేషణ సాగుతూనేవుంది.

రాత్రి ఎనిమిది గంటలు కావస్తున్నప్పుడు మా ఊరి బయట అడ్డరోడ్డు దగ్గర బస్సు దిగాను. గుంటూరునించి వచ్చే బస్సు మా ఊళ్ళోకి రాదు.

అడ్డరోడ్డు దగ్గర దిగాలి. అక్కడినించి ఊళ్ళోకి ఏమంత దూరం ఉండదు. సంచీ భుజానికి తగిలించుకుని ఆ చీకట్లో మట్టిరోడ్డుమీద నడుస్తూ ఊళ్ళోకి వచ్చాను. పుస్తకాల రాఘవయ్యకోసం మా ఊరికి బయల్దేరినప్పుడే ఆ ఊళ్ళో ఎవరింటికి వెళ్ళాలనే ఆలోచన తలెత్తింది. ఎన్నో ఏళ్ళ క్రితం ఆ ఊరిని వదిలేశాం.

ఇప్పుడు ఆ ఊళ్ళో మా బంధువులు అంటూ ఎవరూ లేరు. అప్పుడు నాకు కరణంగారు గుర్తుకువచ్చారు. కరణంగారి కొడుకు మోహనరావు, నేను కలసి చదువుకున్నాం. ఆ ఇంట్లో వాళ్ళందరికీ నేను బాగానే తెలుసు. ఇన్నేళ్ళ విరామం తర్వాత నన్ను గుర్తుపట్టకపోయినా నా గురించి వివరాలు చెప్పుకుంటే గుర్తుపడతారని అనుకుని ముందుగా కరణంగారింటికి వెళ్ళాను. అనుకున్నట్టుగానే కరణంగారు నన్ను గుర్తుపట్టలేదు. "ఎవరూ?" అన్నాడాయన వరండాలో దూలానికి వేలాడుతున్న లాంతరుపత్తిని హెచ్చించి. "నేనండీ.... ప్రసాదరావుని" చెప్పాను. "అంటే ఎవరు?" మళ్ళీ అడిగాడు. అలా అడుగుతున్నప్పుడు ఆయన భార్య వెంకటలక్ష్మమ్మగారు లోపలినించి వచ్చింది. అప్పుడు నేను మా నాన్న పేరు చెప్పాను. కరణంగారు వెంటనే నన్ను గుర్తించి "నువ్వుటోయ్. ఆ ఇప్పుడు గుర్తొచ్చింది. చాలా ఏళ్ళయ్యింది కదూ.... లోపలకు రా" అన్నాడు. కరణంగారు బాగానే పెద్దవాడయ్యాడు.

లోపలకు వెళ్ళి వాల్చివున్న మంచంమీద కూర్చున్నాను. కరణంగారి భార్య పెద్ద స్టీలుచెంబుతో మంచినీళ్ళు తీసుకువచ్చి ఇచ్చింది. నీళ్ళను తాగుతున్నప్పుడు లోపల్నించి కొంచెం లావుగా ఉన్నావిడ మా దగ్గరకు వచ్చింది. ఎవరో అనుకున్నాను.

తీరా లాంతరు వెలుగుతో పరీక్షగా చూస్తే ఆమె కరణంగారి రెండో కూతురు విజయ. బాగా లావయ్యింది. "నువ్వా ప్రసాద్‌రావ్.... అంతా బావున్నారా?" అనడిగింది నన్ను గుర్తించి. తల ఊపాను.

ఇన్నేళ్ళ తర్వాత రాత్రివేళ ఆ ఊరికి ఎందుకు వచ్చానో తెలుసుకోవాలనే ఆత్రుత వాళ్ళందరి మొహాల్లో కనిపించింది.

"మీ నాన్న పోయాడటగదా" అన్నాడు కరణంగారు మంచంమీద నా పక్కనే కూర్చుంటూ.

"అవునండీ"

"మీ నాన్న మంచివాడయ్యా. నువ్వు రాకపోయినా మీ నాన్న అప్పుడప్పుడు ఈ ఊరొచ్చి మా అందరినీ పలకరించి పోతూవుండేవాడు. ఇంతకీ ఏం పనిమీద ఈ ఊరొచ్చావ్?" అని అడిగాడు చివరకు.

"పుస్తకాల రాఘవయ్యను కలవటానికి వచ్చాను" చెప్పాను. ఆయన బాగా ఆశ్చర్యపడి "ఆయనతో నీకేం పని?" అనడిగాడు కరణంగారు.

"కొంచెం పనుందిలెండి" అన్నాడు ముక్తసరిగా. ఏమనుకున్నాడో ఏమోగానీ ఆ తర్వాత ఆయన ఇంక నన్నేమీ అడగలేదు. కరణంగారి భార్య నన్ను స్నానం చేసి రమ్మని, వంట ఏర్పాటు చెయ్యమని కూతురు విజయతో చెప్పింది.

దొడ్లో చప్టామీద నిల్చుని ఆరుబయట చీకట్లో స్నానం ముగించాను. ఆ తర్వాత లాంతరువెలుగులో భోజనాలు ముగించాం. "మీకు శ్రమ ఇస్తున్నాను" అన్నాను భోజనం చేస్తున్నప్పుడు.

"ఇందులో శ్రమ ఏముంది నాయనా.... ఒక ఊరివాళ్ళం. అదీగాక నువ్వు బస్సు దిగి సరాసరి మా ఇంటికి వచ్చావ్. మీ అమ్మ జయమ్మగారు నాకు మంచి స్నేహితురాలు. మా ఇంట్లో ఏ పనికైనా ఆమె నాకు సాయపడేది. మనం దగ్గరివాళ్ళం నాయనా...

అందులోనూ మా మోహన్‌తో కలసి చదువుకున్నవాడివి. శ్రమనిపించదు నాయనా" అంది కరణంగారి భార్య నొచ్చుకుని.

"నువ్వొక్కడివే వచ్చావేం. నీ భార్యాపిల్లల్ని కూడా తీసుకువస్తే బావుండేది" అంది విజయ.

"అవున్నాయనా.... ఇప్పుడు మన ఊరి ఆంజనేయ స్వామి గుళ్ళో నిత్య

ఆకుపూజలు జరుగుతున్నాయి. మీ అమ్మను కూడా తీసుకువస్తే బావుండేది. జయమ్మగారిని చూసి ఎన్నో ఏళ్ళు దాటింది" అంది వెంకటలక్ష్మమ్మ బాధగా. "ఇంకోసారి అందరం వస్తాములెండీ" అన్నాను.

"తప్పకుండా రావాలి" అంది విజయ.

ఊకొట్టాను. కొంచెంసేపు మాటల అనంతరం నాకు ఆరుబయట పడక ఏర్పాటుచేసారు.

వేసవికాలం. బయట పడుకుంటే హాయిగా అనిపించింది. రివ్వున గాలి వీస్తోంది.

కరణంగారు కూడా చిన్న మంచం తీసుకువచ్చి నా మంచం పక్కనే వాల్చుకుని పడుకున్నారు.

ఒకప్పుడు నేను తోటిపిల్లలతో కలసి ఆటలాడుకున్న మైదానం అది. కరణంగారి ఇంటిముందు నుంచి రోడ్డుదాకా విశాలంగా వున్న ఖాళీస్థలం అది.

నా చిన్నతనం, బాల్యస్మృతులు గుప్పున గుర్తుకువచ్చాయి. వాటితో కలసిపోయి పుస్తకాల రాఘవయ్య కూడా గుర్తుకువచ్చాడు. కరణంగారు మంచంమీద కదలడం గమనించి ఆయన నిద్రపోలేదనుకుని పుస్తకాల రాఘవయ్య గురించి అడిగాను.

"ఏమోనయ్యా.... ఇంతకుముందు అప్పుడప్పుడు రోడ్డుమీద కనపడేవడు. ఈమధ్య కనిపించడంలేదు. ఏమయ్యాడో మరి. చూసి చాలాకాలం అయ్యింది" అన్నాడాయన. "రాఘవయ్య గురించి ఎలా తెలుస్తుంది?" అనడిగాను.

"ఏముంది? రాఘవయ్య ఇల్లు తెలుసుగదా కాలవ గట్టుమీద. అక్కడకు వెళ్ళి విచారించు. ఎవరో ఒకళ్ళు చెబుతారు" అన్నాడాయన. ఆయన చెప్పినట్టు చెయ్యడానికి నిర్ణయించుకుని నిద్రలోకి జారిపోయాను.

తెల్లవారింది. పుస్తకాల రాఘవయ్యకోసం మళ్ళీ నా అన్వేషణ మొదలయ్యింది. స్నానం చేసి కాలవ గట్టుమీద వుండే రాఘవయ్య ఇంటిని వెతుక్కుంటూ వెళ్ళాను. చాలా ఏళ్ళు గడవడంవల్ల ఊళ్ళో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి.

రాఘవయ్య ఇంటిని ఎవరో చూపారు. పడిపోవటానికి సిద్ధంగా వున్న ఆ పెంకుటిల్లు తాళం వేసిఉంది. కొంచెం పక్కగా వున్న ఇంట్లో ఎవరో వున్నారు. ఆ ఇంట్లో వున్న ముసలామెను రాఘవయ్య గురించి అడిగాను.

రాఘవయ్య పెద్దవాడు కావడంతో అనారోగ్యంపాలయి మా ఊరు వదిలి పొన్నూరులో ఉంటున్న తమ్ముడి దగ్గరకు వెళ్ళి అక్కడే ఉంటున్నాడట.

రాఘవయ్య ఇంకా బతికివున్నాడని తెలిసినందుకు సంతోషం కలిగింది. మరి ఇప్పుడెట్లా వున్నాడు?

పొన్నూరులో ఉంటున్న రాఘవయ్య తమ్ముడి చిరునామా గురించి ఆమెని అడిగాను.

రాఘవయ్య తమ్ముడు సుందరయ్య కూడా ఆమెకు బాగానే తెలుసునట. ఆ సుందరయ్య ఇంటిని సులభంగా తెలుసుకునే విధంగా గుర్తులు కూడా చెప్పిందామె.

బహుశా వాళ్ళమధ్య ఏదో బంధుత్వం ఉండి వుంటుంది. తిరిగి వచ్చాను. వచ్చీరావడంతోనే కరణంగారు, అడిగారు రాఘవయ్య కనిపించాడా అని.

జరిగింది చెప్పాను. "అయితే పొన్నూరు వెళతావా?" అనడిగాడు. వెళతానని చెప్పాను.

మధ్యాహ్నం భోజనం చేసి పొన్నూరుకు బయల్దేరాడు. మళ్ళీ ఊరి బయట అడ్డరోడ్డుదాకా నడక. గుంటూరునించి వచ్చే బస్సు పొన్నూరుదాకా వెళుతుంది. మా ఊళ్ళోకి రాదు. అడ్డరోడ్డునించే వెళుతుంది.

అడ్డరోడ్డు దగ్గర ప్రయాణీకుల సౌకర్యంకోసం ఎవరో ఒక కత్తెరపాక వేశారు. అందులో ఒక గంటసేపు నిరీక్షించిన తర్వాత పొన్నూరు వెళ్ళే బస్సు వచ్చింది. ఎక్కువమంది జనం లేరు. బస్సు ఎక్కాను.

మరీ ఎక్కువ దూరం లేదు కాబట్టి బస్సు త్వరగానే పొన్నూరు చేరుకుంది. ఆ ఊరు నాకు అంత బాగా తెలీదు. అయినా వాళ్ళనీ వీళ్ళనీ అడుగుతూ చివరకు సుందరయ్య ఇంటిని చేరుకున్నాను.

బాగా పాత పెంకుటిల్లు. ఇంటి బయట చుట్టుపక్కగా పెద్ద వేపచెట్టు ఉంది. నీడగా వుంది అక్కడ.

ఇంటి తలుపులు మూసివున్నాయి.

ఇంటి బయట నిలుచుని చూస్తున్నప్పుడు తలుపులు తెరుచుకుని ఒకాయన బయటకు వచ్చాడు.

రాఘవయ్యని అనుకున్నాను. కాని కాదూ తామ్ముడు సుందరయ్య. అదే

పోలిక. రాఘవయ్య గురించి అడిగాను సుందరయ్యను.

"ఉన్నాడు. పిలుస్తాను ఉండండి" అని మళ్ళీ లోపలకు వెళ్ళి రాఘవయ్యతో బయటకు వచ్చాడు.

"ఎవరు బాబూ" అన్నాడు రాఘవయ్య నన్ను తేరిపార చూస్తూ.

"నా పేరు చెప్పినా నీకు తెలీదు రాఘవయ్యా.... మాది పుసులూరు. గుంటూరులో ఉంటున్నాం. నిన్ను కలుసుకోవటానికి వచ్చాను" అని చెప్పాను. ఏమనకున్నాడో ఏమోగానీ రాఘవయ్య మాట్లాడకుండా ఇంట్లోకి వెళ్ళి ఒక నవారుమంచం తీసుకువచ్చి వేపచెట్టు నీడలో వేసి కూర్చోమన్నాడు. కూర్చున్నాను.

"ఇప్పుడు చెప్పండి" అన్నాడు. మొదలుపెట్టాను.

"నా చిన్నతనంలో నా అక్షరాభ్యాసం తర్వాత నన్ను సుబ్బయ్య పంతులుగారి బడిలో వేశారు. ఆయన సంగతి నీకు తెలుసుకదా.... సహజంగా చదువుమీద నాకు వున్న ఆసక్తికొద్దీ నెలరోజుల్లోనే అక్షరాల, గుణింతాలూ అన్నీ బాగా వచ్చేశాయి.

అప్పుడాయన నన్ను పెద్దబాలశిక్ష కొనుక్కోమని చెప్పాడు. ఆయనే నీ గురించి చెప్పి నీ దగ్గర కొనుక్కోమని సలహా కూడా ఇచ్చాడు. అప్పటినించీ రోజూ నీకోసం ఎదురుచూట్టం మొదలుపెట్టాను.

ఒకరోజు నువ్వు రేకుపెట్టె నెత్తిమీద పెట్టుకుని మా ఇంటిముందునించి వెళుతూ కనిపించావు. మా నాన్న నిన్ను పిలిచాడు. నువ్వు నీ రేకుపెట్టెను మా ఇంటి అరుగుమీద దించుకున్నావు. అందులోనించి అడుగున వున్న పెద్దబాలశిక్షను బయటకు తీశావు. రూపాయి ఖరీదుచేసే పెద్దబాలశిక్షను మా నాన్న బేరమాడి ముప్పావలాకు కొన్నాడు.

నా సంతోషానికి అంతులేదు. మా అన్నయ్యలాగా నేను కూడా పుస్తకాన్ని చదవబోతున్నాను. ఆ రాత్రే పెద్దబాలశిక్షను తిరగగేశాను. ఆ తర్వాత కొద్దిరోజులకే ఆ పెద్దబాలశిక్షను చదవడం పూర్తిచేశాను. నాకు ఎన్నో కొత్త విషయాలు తెలిశాయి.

తర్వాత తరగతి పుస్తకాలు కూడా మా నాన్న నీ దగ్గరే కొన్నాడు.

నీ దగ్గర కొన్ని పుస్తకాలు చదివే నేను ఇంతవాడనయ్యాననే నమ్మకం నాకుంది. ఈమధ్య ఎందుకో నా చిన్నతనం రోజులు పదేపదే గుర్తుకువస్తున్నాయి. వాటితోపాటుగా నువ్వు కూడా.

నువ్వు కనిపించినప్పుడు నీ నెత్తిమీద కదలకుండా కూర్చుని నీతోపాటుగా వీధులన్నీ తిరిగే నీ పుస్తకాల రేకుపెట్టెను చూస్తే సంతోషం కలిగేది. దాన్నిండా

ఎన్ని మంచి పుస్తకాలు? అన్నింటినీ ఒకేసారి చదవాలని అనిపించేది. ఎన్నో రోజులనించీ నిన్ను చూడాలనే కోరిక నాలో బలపడిపోయింది. వీలుపడలేదు.

చివరకు వీలుచేసుకుని నీకోసం గుంటూరునించి వచ్చాను. తీరావస్తే నువ్వు మీ ఊళ్ళో లేవనీ, తమ్ముడి దగ్గిర పొన్నూరులో ఉంటున్నావని తెలిసింది.

అక్కడ తెలుసుకుని ఇక్కడకు వచ్చి నిన్ను కలుసుకున్నాను. నిన్ను కలుసుకున్నందుకు సంతోషంగా ఉంది రాఘవయ్యా" అన్నాను.

నా మాటలు రాఘవయ్యకు సంతోషాన్ని కలిగించినట్టున్నాయి. ఆ ముసలి మొహంలో చిరునవ్వు తాలూకు ఛాయలు కనిపించాయి.

"అవునా బాబూ. వయసు పెరగడంతోపాటు అనారోగ్యం కూడా తోడయ్యింది. ఎప్పటిలాగా రేకుపెట్టె నెత్తిమీద పెట్టుకుని వీధులు తిరుగుతూ పుస్తకాలు అమ్మే ఓపిక లేకపోయింది.

అందుకే మా ఊళ్ళో వున్న ఇంటినీ, అక్కడే వున్న ఎకరం పొలాన్నీ నా తమ్ముడికిచ్చి వచ్చి వాడిదగ్గరే ఉంటున్నాను. వాడు నన్ను బాగానే చూసుకుంటున్నాడు.

నీకు తెలుసుగదా.... నాకు ఎవ్వరూ లేరు. ఎప్పుడయినా ఓపిక వున్నప్పుడు పుస్తకాలు అమ్మటానికి వెళతానని అన్నా నా తమ్ముడు ఊరుకోడు. వాడి పిల్లలు కూడా అంతే.

ఆ పాత పెట్టెలో ఇంకా పుస్తకాలున్నాయి. వాటిల్లో ఎక్కువగా పెద్దబాలశిక్షలే. అయినా వాటిని ఇప్పుడు అడిగేవాళ్ళెవరు బాబూ. ఆ పుస్తకం విలువ చాలామందికి తెలీదు" అన్నాడు రాఘవయ్య బాధగా.

"రాఘవయ్యా! నువ్విప్పుడు చుట్ట కాల్చడంలేదా?" అని అడిగాను. రాఘవయ్యను కలిసినదగ్గర్నించీ అడగాలని అనుకుంటున్నాను.

ఎందుకంటే రాఘవయ్య నోట్లో ఎప్పుడూ ఆరిపోయిన చుట్టముక్క వుండేది. కానీ ఇప్పుడు లేదు.

"లేదు బాబూ. దగ్గు వస్తోందని మానేశాను. మానేసి నాలుగు మాసాలయ్యింది" అని "బాబూ నీకెంతమంది పిల్లలు?" అడిగాడు రాఘవయ్య.

"ఒక్కడే కొడుకు రాఘవయ్యా. ఇప్పుడు మూడో తరగతి చదువుతున్నాడు"

ఇంతలో గుమ్మందగ్గరకు వచ్చి రాఘవయ్యను ఎవరో ఆడామె పిల్చింది. రాఘవయ్య వెళ్ళి కాఫీగ్లాసుతో వచ్చి నాకిచ్చాడు.

"ఇప్పుడెందుకు రాఘవయ్యా" అన్నాను.

"మా తృప్తికోసం బాబూ" అన్నాడు.

కాఫీ తాగుతూ మధ్యలో అడిగాను "రాఘవయ్యా.... నాకు ఒకసారి నీ పుస్తకాల పెట్టెను చూడాలని వుంది. చూపుతావా?" అనడిగాను.

"చూపుతాను బాబూ" అని రాఘవయ్య పెద్దపెద్ద అంగలు వేస్తూ ఇంట్లోకి వెళ్ళాడు.

గాలి వీచినప్పుడల్లా పండిన వేపచెట్టు ఆకులు రాలుతున్నాయి.

రాఘవయ్యలో వృద్ధాప్యంవల్ల వచ్చిన మార్పు తప్పించి వేరే మార్పులు లేవు. ఇప్పటికీ అంతకుముందులాగానే ఎముకలగూడులాగా వున్నాడు. తెల్లగా నెరిసిపోయి గిరిజాలు తిరిగిన జుట్టు, బొద్దుమీసాలు.

కొంచెంసేపటికి రాఘవయ్య రేకుపెట్టెను నెత్తిమీద పెట్టుకుని చేతులు వదిలేసి నడుస్తూ వచ్చాడు. నా చిన్నతనంలో రాఘవయ్యను మళ్ళీ చూసినట్టు అనిపించింది. చిత్రమైన అనుభూతి.

రేకుపెట్టెను మంచంమీద ఉంచి దాని పక్కనే కూర్చుని అందులోని పుస్తకాలను బయటపెట్టాడు. ఆసక్తిగా చూస్తున్నాను. అన్నీ పెద్దబాలశిక్షలే. మధ్యలో నాలుగైదు ఎక్కాల పుస్తకాలు ఉన్నాయి.

"రాఘవయ్యా, నాకో పెద్దబాలశిక్ష కావాలి" అన్నాను వాటినే చూస్తూ.

"ఇప్పుడు నీకెందుకు బాబూ" అన్నాడు ఆయన ఆశ్చర్యపడి.

"నాకు కాదు రాఘవయ్యా. మా అబ్బాయికి. నేను నీ దగ్గర చదివిన పెద్దబాలశిక్షను వాడుకూడా చదవాలి. ఈ పుస్తకం గురించి నేను వాడికి ఎప్పుడో చెప్పాను. వాడు రోజూ దానిగురించి అడుగుతున్నాడు" అన్నాను.

అప్పుడు రాఘవయ్య ఒక పెద్దబాలశిక్షను నాకిచ్చాడు. దాన్ని తీసుకుని జేబులోంచి వందరూపాయల నోటును తీసి రాఘవయ్యకు ఇవ్వబోయాను.

ఆయన దాన్ని తీసుకోకుండా "డబ్బు వద్దు బాబూ. నా మనవడికి ఈ రాఘవయ్య తాత ఇచ్చాడని చెప్పు. దీన్ని చదివి నీ అంతవాడు కావాలన్నానని కూడా చెప్పు" అన్నాడు ఆప్యాయంగా రాఘవయ్య.

నా కళ్ళు చెమర్చాయి. ❖

*స్వాతి వారపత్రిక, 31-1-2014*